

సారథి.. వాహనదారులకు వారధి

ప్రభుత్వం రవాణా శాఖలో తీసుకొచ్చిన సారథి పోర్టల్ విధానాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చి సేవలందిస్తోంది. - 8లో▸



విద్యా రంగంలో కొత్త అధ్యాయం..

గిరిజన వర్సిటీ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు అందుతాయని, విద్యారంగంలో కొత్త అధ్యాయం సృష్టిస్తుందని మంత్రి సీతక్క అన్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం $32^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం అక్కడక్కడా చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధితులకు భరోసా కల్పించాలి



వరంగల్ క్రైం: పదోన్నతులతో బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైలుగా పదోన్నతి పొందిన ఎం.సాంబరెడ్డి, పి.జైపాల్, పి.లక్ష్మారెడ్డి, డి.వెంకటేశ్వర్లు, ఎం.సాంబయ్య, కె.వెంకన్న, డి.సమ్మిరెడ్డి, ఎం.లక్ష్మీనారాయణ, పి.శ్రీనివాస్ రాజు, ఎస్.సదయ్య ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్రాలను అలంకరించి అభినందనలు తెలిపారు. అనంతరం సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులు భరోసా, నమ్మకాన్ని కలిగించాలన్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపిక



గురుకుల విద్యార్థి పర్వతం విక్రమ్

జనగామ రూరల్: ఈనెల 25 నుంచి 27తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థి పర్వతం విక్రమ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపిక అయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస రావు, వైస్ ప్రిన్సిపాల్ నర్సింహులుగౌడ్ అదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి విక్రమ్‌ను కోచ్ లింగ్యా నాయక్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎ.కిషన్, పీఈటీ వేణు, అధ్యాపకుడు వేణుమాధవ్ అభినందించారు. వచ్చే నెల 5నుంచి 8వ తేదీ వరకు జమ్మూకశ్మీర్‌లో జాతీయస్థాయి ఫుట్ బాల్ క్రీడల్లో విక్రమ్ పాల్గొననున్నాడు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు



జనగామ రూరల్: భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం యువత పోరాటాలకు సిద్ధం కావాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.తిరుపతి పిలుపునిచ్చారు. అదివారం జిల్లా అధ్యక్షుడు ధర్మబిక్షం అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. అహర్నిశలు కష్టపడి చదువుకున్న చదువుకు ఉపాధి దొరకక యువత చెడు మార్గాలకు, వ్యసనాలకు బానిసలు అవుతున్నారన్నారు. దేశంలో కులమత ప్రాంత రాజకీయాలు పెరిగిపోయాయని, అందుకే స్వచ్ఛమైన రాజకీయాల కోసం ఉద్యమించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బానోత్ ధర్మబిక్షం, కార్యదర్శిగా బొడ నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పంతం సాయిప్రసాద్, ఉపాధ్యక్షులుగా నిరేటి సంపత్, చింతకింది అజయ్, సహాయ కార్యదర్శిగా పోత్కునూరి కనకచారి తదితరులు ఎన్నికయ్యారు.

ఎస్సీ మహిళకు జెడ్పీ పీఠం

జనగామ, చిల్పూరు, లింగాలఘణపురం జెడ్పీటీసీలు ఎస్సీలకు రిజర్వ్

- అందరి చూపు ఆ మూడు మండలాల వైపు..
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో అభ్యర్థి ఎంపికపై కసరత్తు
- తెరపైకి ఆశావహులు



జనగామ: జిల్లా జెడ్పీ పీఠం ఈసారి ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో జిల్లా రాజకీయాల్లో కసరత్తుల ఎంపిక ఉత్కంఠ కలిగిస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ రెండు పార్టీలు అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేయనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు కావడంతో సర్వత్రా ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. జెడ్పీ రిజర్వేషన్ ఎస్సీ మహిళకు కేటాయించడంతో జిల్లా రాజకీయాలు పరిషత్ చుట్టూనే తిరగడంతో పాటు రాజకీయ సమీకరణాలు సైతం మారిపోయాయి.

మొదలైన వ్యూహరచన

జిల్లాలో జెడ్పీ పీఠం కోసం అధికార కాంగ్రెస్ ఇప్పటికే వ్యూహరచన మొదలు పెట్టింది. స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర లింగాలఘణపురం నుంచి జెడ్పీటీసీ బరిలో దిగుతారనే ప్రచారం వినిపిస్తోంది. జిల్లాలో మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తే చివరకు ఇందిరనే జెడ్పీ చైర్మన్ పదవిని సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయనే ఊహాగానాలు ఆ పార్టీలో చర్చకు దారితీస్తున్నాయి. ఇదే సమయంలో బీఆర్ఎస్ కూడా తమకు బలమైన అభ్యర్థిని నిలబెట్టి పీఠాన్ని దక్కించుకునేందుకు అంతకన్నా రెట్టింపు కసరత్తులు చేస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జనగామ మండలం నుంచి కాంగ్రెస్ పార్టీలో డాక్టర్ రాజమౌళి, గనిపాక మహేందర్, బక్క శ్రీనివాస్ పేర్లు వినిపిస్తుండగా, బీఆర్ఎస్ నుంచి పగిడిపాటి సుధసుగుణాకర్‌రాజు, కొమ్ము రాజు, మరో ఇద్దరు బరిలో నిలిచేందుకు ముందుకొస్తున్నారని పార్టీలో చర్చించుకుంటున్నారు. చిల్పూరు, లింగాలఘణపురం మండలాలలో కాంగ్రెస్ నుంచి ఆ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర, గడ్డమీది సురేశ్, పాశం సురేశ్, బీఆర్ఎస్ నుంచి ఎడ్ల మహిపాల్, ఉడుగుల భాగ్యమ్మ టికెట్ రేసులో ఉన్నట్లు సమాచారం. కోర్టు తీర్పు నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలై రిజర్వేషన్లు యథాతథంగా కొనసాగితే, కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు పండగ తర్వాత తమ అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉంది. రిజర్వేషన్లు ఖరారు కావడం, వీటిపై పలువురు కోర్టుకు వెళ్లడంతో రెండు పార్టీల్లో రాజకీయ వేడి పెంచుతోంది.

మారనున్న సమీకరణాలు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జిల్లాలో తొలిసారి జెడ్పీ చైర్మన్‌గా దివంగత పాగాల సంపత్‌రెడ్డి (జనరల్ కేటగిరీ) బాధ్యతలు స్వీకరించారు. రెండోసారి జరగనున్న ఈ ఎన్నికల్లో ఎస్సీ మహిళకు పీఠం రిజర్వ్ కావడంతో దళిత మహిళా చైర్మన్ పదవిని ఎవరు వరిస్తారనే చర్చ జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. రాబోయే రోజుల్లో పార్టీల అభ్యర్థుల ఎంపికలు, కూటములపై ఆధారపడి జిల్లాలో రాజకీయ సమీకరణలు ఎలా మారతాయనేది ఆసక్తిరేపుతోంది. బీజేపీ సైతం బలమైన జెడ్పీటీసీ అభ్యర్థులను బరిలో దింపేందుకు పార్టీ శ్రేణులతో సమావేశం అయ్యేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. సీపీఎం, సీపీఐ పార్టీలు తమ ఉనికిని చాటుకునేందుకు పక్కా ప్రణాళికలను వేస్తుండగా, స్వతంత్రులు రాజకీయ పార్టీలకు గట్టి పోటీ ఇచ్చేందుకు వ్యూహాలు పన్నుతుండగా..వారి కదలికలను అధికార, ప్రధాన ప్రతిపక్షం ఎప్పటికప్పుడు పసిగడుతున్నట్లు వినికిడి.

మూడు మండలాలపై ఫోకస్

చిల్పూరు, జనగామ మండలాలు ఎస్సీ జనరల్, లింగాలఘణపురం ఎస్సీ మహిళకు రిజర్వు చేశారు. మూడు మండలాల నుంచి దళిత సామాజిక వర్గానికి చెందిన మహిళలు జెడ్పీటీసీ ఎన్నికల బరిలోకి దిగి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ మూడు మండలాల పరిధిలో జెడ్పీటీసీ టికెట్ పొందిన అభ్యర్థులు జడ్పీ చైర్మన్ రేసులో కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది. దీంతో రెండు పార్టీల్లోనూ టికెట్ కోసం నువ్వా నేనా అన్నట్లు పోటీ నెలకొంది. కాగా బచ్చన్నపేట మండలం జనరల్ కేటగిరీ, కొడకండ్ల మండలం జనరల్ మహిళ కేటగిరీగా రిజర్వ్ కావడంతో అక్కడ సైతం దళిత వర్గానికి చెందిన పలువురు నాయకులు కన్నేసినట్లు సమాచారం.

పండగ జరుపుకునేదెలా?

- ఎంసీహెచ్ ఎదుట కార్మికుల ఆవేదన

జనగామ: నాలుగు నెలలుగా వేతనాలు లేక పస్తులు పడుతున్న జనగామ చంపక్‌హిల్స్ మాతాశిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) ఆల సర్వీసెస్ కాంట్రాక్టు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సద్దులు, దసరా పండగ సందర్భంగా చేతిలో చిల్లిగవ్వ లేక సంబురాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెల కొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం కార్మికులు ఎంసీహెచ్ ఎదుట తమ ఆవేదన వెలిబుచ్చారు. పండగ సమయంలో ఆర్థిక ఇబ్బందులు రాకుండా, కుటుంబాలతో కలిసి ఆనందంగా గడిపేందుకు వేతనాలు విడుదల చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, కలెక్టర్ దృష్టికి సైతం తీసుకువెళ్లామన్నారు. 80 మంది కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎంసీహెచ్ ఎదుట కార్మికులు

అంబేడ్కర్ ఓవర్సీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి బి.విక్రమ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సహాయానికి అర్హులైన వారు ఏదైనా 4 సంవత్సరాల డిగ్రీ చదివిన వారు, చివరి సంవత్సరం చదువుతున్న అర్హులన్నారు. అమెరికా, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్ కొరియా, దేశాలలో ఉన్నత చదువు చదివేందుకు చక్కని అవకాశం అని ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 19లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నిక

జనగామ: జనగామ యూనిట్ రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో మాజీ జిల్లా అధ్యక్షుడు రామన్న, మాజీ రాష్ట్ర బాధ్యులు వి.యాదవ రెడ్డి, సీనియర్ సభ్యులు టి.మల్లికార్జున్, బి.శంకరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జనగామ యూనిట్ నూతన అధ్యక్షుడిగా కసిరెడ్డి మహబూబ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొక్కొండ జగదీశ్వరాచారి, ఆర్థిక కార్యదర్శి హుస్సేన్ రియాజుల్లా, అసోసియేట్ అధ్యక్షుడు వి.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు అజం అలీ, మహిళా ఉపాధ్యక్షురాలు జి.ఉమాదేవి, సంయుక్త కార్యద్శి టి.జ్ఞానేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.లక్ష్మణ్, ప్రచార కార్యదర్శి బి.కృష్ణమూర్తి, జిల్లా కౌన్సిలర్లు జి.రమాదేవి, ఎం.నిరంజన్‌రెడ్డి, వి.విమలాదేవి ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చాడ వెంకట్‌రెడ్డి, సీహెచ్ రవీందర్‌రెడ్డి, కె.బాలయ్య, సీతారామారావు, రాజయ్య, సిద్దిమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

గ్రూప్-2లో సత్తాచాటారు..

గ్రూప్–2 ఫలితాల్లో జిల్లా అభ్యర్థులు సత్తాచాటారు. ఆదివారం టీజీపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో పలువురు కొలువులు సాధించారు. సామాన్య కుటుంబాలకు చెందిన అభ్యర్థులు అహర్నిశలు కష్టపడి, పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరడంపై అభినందనలు వెల్లువెత్తాయి.

ఎస్సై నుంచి డిప్యూటీ తహసీల్దార్‌గా..



కూటికంటి శివ

పాలకుర్తి టౌన్: మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన కూటికంటి శివ డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో 25వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం శివ మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విజయం తన తల్లిదండ్రుల కుటికంటి లక్ష్మీ, వెంకన్న ప్రోత్సాహం వల్లే లభించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

బానాజీపేట గ్రామం నుంచి ఇద్దరు..





నాగరాజు,మదన్ మోహన్

జనగామ: మండలంలోని బానాజీపేట గ్రామానికి చెందిన ఆకుల నాగరాజు, కొలుపుల మదన్‌మోహన్ గ్రూపు –2లో సత్తా చాటారు. ఆకుల నాగరాజు బచ్చన్నపేట మండల ఏఎస్‌ఓగా విధులు నిర్వహిస్తూ గ్రూపు–2లో అసిస్టెంట్ ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. కొలుపుల మదన్‌మోహన్ మొదటి ప్రయత్నంలోనే గ్రూపు–2లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌ఓ)గా ఎంపికయ్యారు. గ్రామం నుంచి ఇద్దరు గ్రూపు–2లో ఉద్యోగాలు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సింగరేణి ఉద్యోగి.. బీసీ వెల్ఫేర్ అధికారిగా



అమర్‌నాథ్

జనగామ: మండలంలోని వడ్లకొండకు చెందిన పన్నీరు లక్ష్మణ్ కుమారుడు అమర్‌నాథ్ బీసీ వెల్ఫేర్ అధికారిగా ఉద్యోగం సంపాదించారు. గ్రూప్–4లో ఉద్యోగం సంపాదించి సింగరేణిలో పనిచేస్తున్న అమరనాథ్, కష్టపడి చదువుకుని గ్రూప్–2 ఉద్యోగం సాధించారు. పేద కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు కొడుకుపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాడని అమర్‌నాథ్‌ను గ్రామస్థులతో పాటు స్నేహితులు అభినందించారు.

ఎక్సైజ్ ఎస్‌ఐగా సివిల్ సప్లై ఉద్యోగి..



కేదారేశ్వర్ రెడ్డి

జనగామ రూరల్: మండలంలోని సిద్దెంకి గ్రామానికి చెందిన సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, నిర్మల కుమారుడు సుంకరి కేదారేశ్వర్‌రెడ్డి ఆదివారం విడుదల చేసిన గ్రూప్– 2 ఫలితాల్లో ఎక్సైజ్ ఎస్‌ఐగా ఉద్యోగం సాధించారు. గతంలో గ్రూప్–4లో సివిల్ సప్లైలో ఉద్యోగం సాధించి విధులు నిర్వహిస్తున్నారు. అలాగే గ్రూప్–3లో స్టేట్ 10వ ర్యాంక్ సాధించారు.

ఏఆర్ ఎస్సై నుంచి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా



సాయి చరణ్‌గౌడ్

జనగామ: రఘునాథపల్లి మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన పుల్ల రవి–పద్మ దంపతుల చిన్న కుమారుడు పుల్ల సాయిచరణ్‌గౌడ్ గ్రూపు–2లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో ఎస్సై (ఏఆర్)గా విధులు నిర్వహిస్తూ గ్రూపు–2లో ఫలితాల్లో స్టేట్ 92 ర్యాంక్ సాధించి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (గెజిటెడ్) ఉద్యోగం సాధించారు. ఆయన సోదరుడు సాయికిరణ్ సైతం మంచిర్యాల బెటాలియన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించడం విశేషం. తన సోదరుడు, తల్లిదండ్రులు, భార్య అక్షిత ప్రోత్సాహం ఎంతో ఉపయోగపడినట్లు సాయి చరణ్‌గౌడ్ తెలిపారు.

సీటీఓగా శివశంకర వరప్రసాద్



శివశంకర వరప్రసాద్‌తో తల్లిదండ్రులు

జనగామ: గ్రూప్–1 ఫలితాల్లో జనగామ పట్టణానికి చెందిన తగరపు నర్సింహులు, పద్మ దంపతుల మూడో కుమారుడు తగరపు శివశంకర వరప్రసాద్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ (సీటీఓ)ఎంపికయ్యారు. పట్టణంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో ప్రాథమిక, ఉన్నత విద్యను పూర్తి చేసిన వరప్రసాద్, ఏబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో బీఈ చేశారు. మొదటి ప్రయత్నంలోనే నిర్వహించిన గ్రూప్–1 పరీక్షల్లో రాష్ట్రంలో 330వ ర్యాంకు సాధించారు. వరప్రసాద్‌ను తల్లిదండ్రులు, పట్టణప్రజలు అభినందించారు.

‘సద్దుల’కు సిద్ధం



పట్టణంలోని సిద్దిపేట రోడ్డులో రద్దీ



బంతిపూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



జనగామ బతుకమ్మకుంటలో సద్దుల వేడుకల కోసం ఏర్పాట్లు

నేడు సద్దుల బతుకమ్మ వేడుకలు

- బతుకమ్మకుంటలో ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం
- బతుకమ్మ పూలకు ఫుల్ డిమాండ్

జనగామ: బతుకమ్మ సంబురాలు నేటి సద్దుల (సోమవారం)తో ముగియనున్నాయి. జిల్లాలోని జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల పరిధిలో ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సద్దుల బతుకమ్మ పండగతో జిల్లా అంతటా సందడి నెలకొంది. పట్టణంలోని బతుకమ్మకుంట, రంగప్ప చెరువు ఏరియా (బాణాపురం) ప్రాంగణంలో మునిసిపల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కాగా తహసీల్దార్, గ్రేయిన్‌మార్కెట్, శివాలయం, చమన్, అంబేడ్కర్ నగర్, శ్రీ విల్లాస్, బాలాజీనగర్, జీఎంఆర్ కాలనీ, శ్రీ సాయి రెసిడెన్షియల్, అంబేడ్కర్‌నగర్, ధర్మకంచ, కుర్మవాడ, గోకుల్‌నగర్, గీతానగర్, గిర్నిగడ్డ, గుండ్లగడ్డ, జీఎంఆర్ కాలనీ, జ్యోతినగర్ తదితర కాలనీల్లో సద్దుల బతుకమ్మ వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 30వ తేదీన సద్దుల బతుకమ్మ పండగ జరుపుకోవాలని చెబుతుండగా, వేద పండితుల సూచనల మేరకు జిల్లాలో సోమవారమే జరుపుకోనున్నారు.

ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

అర్ధరాత్రి 12 గంటల వరకు సద్దుల బతుకమ్మ ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశాల మేరకు ఏసీపీ పండేరి చేతన్ నితిన్ పర్యవేక్షణలో సీఐ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయనున్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. వేడుకలు జరిగే బతుకమ్మకుంట, తదితర ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగకుండా పోలీసు ఇంటర్‌సెప్టార్, బ్లూకోర్ట్, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు రంగంలోకి దిగనున్నాయి.

పండగ షాపింగ్‌తో కిటకిట..

సద్దుల బతుకమ్మ, దసరా పండుగలతో జిల్లా కేంద్రంలో ఎక్కడా చూసిన సందడి నెలకొంది. ప్రధాన రహదారులు, నెహ్రూ పార్క్ పరిసరాలు, రైల్వేస్టేషన్ ప్రాంతం, స్వర్ణకళామందిర్ దారులు హైదరాబాద్ ట్రాఫిక్‌ను తలపించేలా కిక్కిరిసిపోయాయి.

రెండు రోజులు వేడుకలు: కమిషనర్

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 30వ తేదీన రోజున సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహించాలని కోరడం జరిగిందని మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. పట్టణ ప్రజల కోరిక మేరకు సద్దుల వేడుకలను బతుకమ్మకుంటలో రెండు రోజుల పాటు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ నెల29, 30వ తేదీల్లో నిర్వహించే సద్దుల పండగ నేపథ్యంలో పట్టణ ప్రజలు పాల్గొనాలని కమిషనర్ కోరారు.

కిటకిటలాడిన బస్టాండ్

సద్దుల బతుకమ్మ, దసరా పండగ సందర్భంగా హైదరాబాద్–ఉప్పల్, హన్మకొండ, సూర్యాపేట, సిద్దిపేట తదితర రూట్లలో జనగామ ఆర్టీసీ డిపో స్పెషల్ సర్వీసులను నడిపించారు. ఉద్యోగ, బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లిన కుటుంబాలు పండగ కోసం స్వగ్రామాలకు బయలుదేరారు. దీంతో జనగామ ఆర్టీసీ బస్టాండు వేలాదిమంది ప్రయాణికులతో కిటకిటలాడింది. ఆదివారం ఒక్కరోజే సుమారు 60 వేల మంది ప్రయాణికులు జిల్లా కేంద్రానికి చేరుకోగా, ఇక్కడ నుంచి 15వేల మంది వరకు వెళ్లి ఉంటారని అంచనా.

జనగామ జిల్లాతో పాటు యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల పరిసర ప్రాంత ప్రజలు పండగ షాపింగ్ కోసం పెద్దఎత్తున తరలిరావడంతో వ్యాపార, వాణిజ్య కేంద్రాలు కిటకిటలాడాయి. ఆదివారం ఒక్క రోజే కోట్లలో వ్యాపారం జరిగినట్టు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. కిరాణా, కంగన్‌హాల్, లేడీస్ ఎంపోరియం వ్యాపారంతో ఆ ప్రాంతంలో కాలిబాటన సైతం వెళ్ల లేని పరిస్థితి ఏర్పడింది. సద్దుల బతుకమ్మ పండగ నేపథ్యంలో తంగేడు పువ్వు కరువవడంతో బంతి పూల విక్రయాలు రికార్డు స్థాయిలో పెరిగాయి. పట్టణంలో గునుగు, గడ్డిబంతి, చేమంతి, గొలుసుకట్టు తదితర పూల అమ్మకాలు జోరుగా సాగాయి.

వలసవాదులం కాదు.. మూలవాసులం

- లంబాడీలు ఐకమత్యంతో రాజ్యాధికారం సాధించాలి
- ఆదివాసీ, లంబాడీల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్రలు
- లంబాడీల ఆత్మగౌరవ సభలో నేతలు

నెహ్రూసెంటర్: లంబాడీలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వలసవాదులుగా చిత్రీకరించేందుకు కొందరు పనిగట్టుకుని కుట్రలు చేస్తున్నారని, మేము వలసవాదులం కాదు.. మూలవాసులమని గిరిజన నేతలు పేర్కొన్నారు. లంబాడీ రిజర్వేషన్ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం లంబాడీల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడూ.. ఆదివాసీ, లంబాడీల మధ్య చిచ్చు పెట్టేలా కుట్రలు చేస్తున్నారని ఆదివాసీల భుజాలపై తుపాకీ పెట్టి లంబాడీలను కాల్చేలా పతకం వేస్తున్నారని మండిపడ్డారు. ఆదివాసీ, లంబాడీల హక్కుల కోసం కలిసి పోరాటం చేసేందుకు సిద్ధమన్నారు. కొంత మంది జాతి కోసం పోరాటం చేస్తే ఫలాలు పొందుతున్నాం. లంబాడీలను రెచ్చగొట్టి ఇబ్బంది పెట్టేలా ఎవరు చేసినా.. కాలగర్భంలో కలిపేలా కలిసికట్టుగా ఉండాలి. రాజకీయ అవకాశాలు వస్తే ఒక్కతాటిపై ఉండి జాతి కోసం నిలబడాలని, ఈ ఉద్యమంలో మీతో ఉంటానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. జాతి కోసం జరుగుతున్న పోరాటంలో లంబాడీ ప్రజాప్రతినిధులు కలిసి రావాలన్నారు. రిజర్వేషన్ల కోసం, తండాలను గ్రామ పంచాయతీల కోసం పోరాటాలు చేసి సాధించుకున్నాం. పాలకులు రెచ్చగొట్టి కలిసి ఉన్న ఆదివాసీ, లంబాడీల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్నారన్నారు. జాతికోసం అందరూ ఐక్యమవుదాం, పార్టీలకు అతీతంగా కలిసివచ్చి రాజ్యాధికార సాధనలో ముందుండాలన్నారు. మాజీ ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ.. ప్రభుత్వాలపై పోరాడి హక్కులు సాధించుకోవాలే తప్ప లంబాడీలను రాజకీయం కోసం వాడుకోవాలని చూస్తే వారిని రాజకీయ భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. సేవాలాల్‌సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ నాయక్ మాట్లాడుతూ.. రాజకీయాలను పక్కన బెట్టి జాతి మనుగడ సాధించేలా, రాజ్యాధికారం కోసం లంబాడీలంతా ఏకం కావాలన్నారు. హక్కులు, చట్టాలు సాధించుకునేలా పోరాటాలు సాగించాలని, రిజర్వేషన్ కాపాడుకునేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ఎస్టీ జాబితా నుంచి తప్పించే కుట్రలను తిప్పికొట్టేలా ప్రతి ఒక్కరూ పోరాటాల్లో కలిసి రావాలని పిలుపునిచ్చా రు. జేఏసీ చైర్మన్ డాక్టర్ జగదీశ్వర్, వైస్ చైర్మన్ గుగులోత్ కిషన్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో దారావత్ వెంకన్ననాయక్, బోడ లక్ష్మణ్‌నాయక్, గుగులోత్ భీమానాయక్, బోడ రమేష్‌నాయక్, డాక్టర్ రాజ్‌కుమార్‌జాదవ్, హత్యానాయక్, డాక్టర్ వివేక్, హరినాయక్, మంగీలాల్, గుగులోత్ రవి, చందులాల్, సిద్దునాయక్, కర్నావత్ వెంకన్న, మాలోత్ రవీందర్, లింగ్యానాయక్ ఉన్నారు.



లంబాడీల ఆత్మగౌరవ సభలో అభివాదం చేస్తున్న నాయకులు



సభకు హాజరైన లంబాడీలు



సభలో నృత్యం చేస్తున్న మహిళలు

సారథి.. వాహనదారులకు వారధి

ఇంటి నుంచే డ్రైవింగ్ లైసెన్స్‌లు

- ఉమ్మడి జిల్లాలో అందుబాటులోకి పోర్టల్
- దేశవ్యాప్తంగా ఒకే పోర్టల్.. ఒకే లైసెన్స్ విధానం అమలు
- రోడ్డు భద్రతపై అవగాహన ఉంటేనే డ్రైవింగ్ లైసెన్స్
- త్వరలోనే ఆర్టీఏలో దళారుల వ్యవస్థ కనుమరుగు



వరంగల్ రవాణాశాఖ కార్యాలయం

ఖిలా వరంగల్ : రవాణా శాఖలో సంస్కరణల శకం మొదలైంది. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న వాహన్ వెబ్‌సైట్‌లోని డేటాబేస్‌తో రవాణాశాఖ అనుసంధానమైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖలో తీసుకొచ్చిన సారథి పోర్టల్ విధానాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చి సేవలందిస్తోంది. వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయాల్లో సారథి పోర్టల్ అమలుకు ఆగస్టు 18 తేదీన శ్రీకారం చుట్టారు. పోర్టల్‌లో తలెత్తుతున్న స్వల్ప సాంకేతిక ఇబ్బందులను దశల వారీగా సవరణ చేశారు. ప్రస్తుతం పోర్టల్‌లో నమోదు ప్రక్రియ విజయవంతమవుతోంది. ఇప్పటి వరకు సిటిజన్ ఫ్రెండ్లీ సర్వీస్ ఇన్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్(సీఎఫ్ఎస్టీ) పోర్టల్ పనిచేయగా ఇకపై దేశవ్యాప్తంగా కేంద్రం అమలు చేస్తున్న పరివాహన్ ద్వారా సేవలు అందనున్నాయి. ఆయా ఆర్టీఏ కార్యాలయాల్లో సేవలు పారదర్శకంగా అందుతున్నాయి.

విదేశాల నుంచైనా అవకాశం..

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన సారథి పోర్టల్ ద్వారా దేశ, విదేశాల నుంచైనా ఆన్‌లైన్‌లోనే ఇంటి నుంచి లైసెన్స్ తీసుకునే అవకాశం ఉంటుంది. రోడ్డు భద్రతపై పరిజ్ఞానం ఉంటే సులభంగా పరీక్ష ఉత్తీర్ణత కావొచ్చు. కాగా, సారథి పోర్టల్‌తో ఇంటి నుంచే లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందడం, రెన్యువల్, చిరునామా మార్పు వంటి అంశాలకు వీలు కల్పించనున్నారు. ప్రస్తుతం పోర్టల్ ద్వారా లెసెన్స్ తీసుకునే అవకాశం మాత్రమే కల్పించారు. అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకొని విదేశాలకు వెళ్లిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించక అక్కడి అధికారులు వాటిని తిరస్కరించిన ఘటనలు ఉన్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టొచ్చని ఎంవీఐలు భావిస్తున్నారు. కొత్త విధానంలో సాంకేతిక సమస్యల కారణంగా స్లాట్ బుకింగ్, వాహనదారులు ఆర్టీఏ కార్యాలయం వచ్చిన తర్వాత కొంత ఆలస్యం అవుతోంది. కొన్నాళ్లకు త్వరిగతిన సేవలు అందుతాయని అధికారులు అంటున్నారు. వాహనదారులు rarathiparivahan.gov.in / rarathirervicerలో స్లాట్ బుక్ చేసుకోవచ్చు.

ఇండియాలో ఒకే విధానం..

పరివాహన్ సారథి పోర్టల్ ద్వారా పొందిన లైసెన్స్ ఇండియాలో ఎక్కడైనా చెల్లుబాటు అవుతుంది. రెన్యువల్ టైంలో ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశం ఉంది. ఈకార్డు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చెల్లుబాటు అవుతుంది. ఇంతకాలం ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్ర పరిధిలోనే లైసెన్స్ ఉండేది. వివరాలు మరో రాష్ట్రంలో కనిపించేవి కాదు. అంతా గోప్యంగా ఉండేది. కానీ ప్రస్తుతం నూతనంగా వచ్చిన పరివాహన్ సారథి పోర్టల్ ద్వారా క్షణాల్లో వాహనదారుడి వివరాలు చేతికి వస్తాయి.

కనిపించని లైసెన్స్ కార్డు..



పరివాహన్ సారథి పోర్టల్‌లో లైసెన్స్ పొందిన వాహనదారుడికి కార్డు చేతికి రాదు. వాహనదారుడు డీఎల్ పరీక్ష రాయగానే ఆన్‌లైన్‌లోనే కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రత్యక్షంగా కార్డు ఇచ్చేది ఏమీ ఉండదు. ఫోన్‌కు వచ్చిన లింక్ ఓపెన్ చేస్తే కార్డు మీ మొబైల్‌లోనే డౌన్‌లోడ్ అవుతోంది. తనిఖీ సమయాల్లో ఆర్టీఏ, పోలీస్ అధికారులు పోర్టల్‌లో డౌన్ లోడ్ చేసుకున్న కార్డును చూపిస్తే సరిపోతోంది.

దళారుల వ్యవస్థ ఇక కనుమరుగు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాల్లో వాహనదారులు దళారులపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఇంతకాలం ఆర్టీఏలో డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు లర్నింగ్ లైసెన్స్ కావాలన్నా ఎంతో కొంత ముట్టచెప్పాల్సి వచ్చేది. సారథి పోర్టల్ అందుబాటులోకి రావడంతో నిదానంగా ఈ అవినీతి తగ్గుముఖం పడుతోంది. ఆర్టీఏ సేవలు ఇక సులభంగా పొందే అవకాశం ఉన్నా.. చదువుకున్న వ్యక్తికే డ్రైవింగ్ లైసెన్స్ జారీ అయ్యే అవకాశం ఉంది. దీని ద్వారా దేశంలో ఎక్కడి నుంచైనా వాహనదారులు రవాణా సేవలు పొందే వెసులు బాటు వచ్చింది. ఆన్‌లైన్‌లో పరిజ్ఞానం ఉంటే లర్నింగ్ లైసెన్స్ పరీక్ష సులభతరంగా ఉంటుందని రవాణాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం లైసెన్స్‌లకు ధ్రువీకరణ పత్రాల హార్డ్ కాపీ జత చేయాల్సి వస్తోంది. కొత్త విధానంలో సాఫ్ట్ కాపీతో సరిపోతుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఆగస్టు 18 నుంచి పరివాహన్ సారథి ద్వారా సేవలు అందిస్తున్నారు. రోజుకు 430 మందికి ఆన్‌లైన్‌లో వివిధ లైసెన్స్‌లకు స్లాట్స్ అందుబాటులో ఉన్నాయి.

సారథి పోర్టల్‌తోనే సేవలు



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ జారీ సారథి పోర్టల్ ద్వారా అందిస్తున్నాం. ఆగస్టు 18న ప్రభుత్వం శ్రీకారం చుట్టగా ఈనెల మొదటి వారం నుంచి పూర్తి స్థాయిలో ఎల్ఎల్, డీఎల్‌లు అందజేస్తున్నాం. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు అధిగమించి సేవలు అందిస్తున్నాం.

జి. సురేశ్ రెడ్డి డీటీసీ, హనుమకొండ, వరంగల్

విద్యా రంగంలో కొత్త అధ్యాయం

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు: సమ్మక్క, సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు లభిస్తాయని, విద్యారంగంలో ఈ యూనివర్సిటీ కొత్త అధ్యాయం సృష్టిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పరిధిలోని సాయిబాబా టెంపుల్ రోడ్ శివారులో సమ్మక్క, సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ విశ్వవిద్యాలయ ప్రహరీ నిర్మాణ పనులను మహబూబాబాద్, ఆదిలాబాద్ ఎంపీలు పోరిక బలరాం నాయక్, జి.నాగేశ్, కలెక్టర్ దివాకర టి.ఎస్, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వైఎల్.శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుతో ములుగు జిల్లాకు ప్రత్యేక గౌరవం లభిస్తుందని, గిరిజన విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ఇది బలమైన వేదిక అవుతుందని తెలిపారు. ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉందని, యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక వసతులు సమకూర్చుతామని పేర్కొన్నారు. స్థానిక విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా రంగం, జిల్లా అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, మాజీ ఎంపీ సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి మూడేళ్ల 'లా' ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల 'లా కోర్సు ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు అక్టోబర్ 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ తెలిపారు. 8న మొదటి పేపర్, 10న రెండో పేపర్,14న మూడో పేపర్, 16న నాలుగో పేపర్, 18న ఐదో పేపర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.

స్కాన్ చేస్తే ఆలయ చరిత్ర



ఆలయ ఆవరణలో పురావస్తు శాఖ ఏర్పాటు చేసిన క్యూఆర్ స్కానర్

హన్మకొండ చౌరస్తా: చారిత్రక వేయిస్తంభాల ఆలయ చరిత్రను తెలుసుకునేందుకు ఇక గైడ్ అవసరం లేదు. ఆలయ చిత్రాలు, చరిత్రను క్షుణ్ణంగా వివరించేలా పురావస్తు శాఖ అధికారులు ఆలయ ప్రాంగణంలో క్యూఆర్ స్కానర్లను ఏర్పాటు చేశారు. గూగుల్ క్రోమ్ లోకి వెళ్లి స్కాన్ చేస్తే చాలు చరిత్ర తెలియజేస్తుంది.

పద్మశాలీలు ఉన్నత శిఖరాలకు చేరాలి

- అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందకట్ల స్వామి



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న శామంతుల శ్రీనివాస్

హన్మకొండ: పద్మశాలి కులస్తులు ఉన్నత శిఖరాలకు చేరాలని అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందకట్ల స్వామి అన్నారు. పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) ఆధ్వర్యంలో హనుమకొండలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతిభ కనబరిచిన పద్మశాలి విద్యార్థులకు ఆదివారం ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కందకట్ల స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పట్టుదలతో ముందుకు పోతే లక్ష్యాన్ని సాధిస్తారన్నారు. గ్రూప్స్, సివిల్స్‌లో పద్మశాలీలు ఇప్పుడిప్పుడే రాణిస్తున్నారన్నారు. రాజకీయాల్లోనూ రాణించాలని సూచించారు. పోపా రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివితే సాధించలేనిదంటూ ఉండదన్నారు. నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వాలని కోరారు. పోపా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే తమ సంఘం లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ అవార్డులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి రమేశ్, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి, పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు పద్మశాలి సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, పాము శ్రీనివాస్, గోషికొండ సుధాకర్, బైరి శ్యాంసుందర్, మాటేటి అశోక్, సంతోష్, ధర్మపురి రాజగోవింద్, దిడ్డి అనిల్, బత్తుల సత్యం, వంగరి వేణు, గుండేటి సతీశ్, కందకట్ల రాకేశ్, వడ్నాల సత్యనారాయణ, గుండు రవి, డాక్టర్ వన్నాల వెంకటరమణ, కుసుమ సతీశ్, వైద్యం రాజగోపాల్, డాక్టర్ కూరపాటి రాధిక, డాక్టర్ అంబటి అజయ్, మోతె రాజకుమార్, శ్రీరాముల శ్రీనివాస్, డాక్టర్ చింతకింది శ్రీనివాస్, విటోభా పాల్గొన్నారు.

బాలికలు, మహిళలకు జిల్లా స్థాయి చెస్‌పోటీలు



చెస్ ఆడుతున్న బాలికలు, మహిళలు

విద్యారణ్యపురి : ధర్మసాగర్ చెస్ నెట్‌వర్క్ క్లబ్, దండేపల్లి క్లబ్, ముప్పారం క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబురాల్లో భాగంగా హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో బాలికలు, మహిళలకు వరంగల్ జిల్లా స్థాయి చెస్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు గుంటి స్వప్న ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీలు బాలబాలికలు, మహిళల్లోని ప్రతిభ వెలుగులోకి రావడానికి దోహదపడుతాయన్నారు. అనంతరం న్యూరో సైకియాట్రిస్ట్ జగదీశ్‌బాబు మాట్లాడుతూ చదరంగం జీవన నైపుణ్యాలు నేర్పిస్తూ మానసిక శక్తిని వ్యూహాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తుందన్నారు. చీఫ్ ఆర్బటర్ రజనీకాంత్, ఆర్బిటర్ శివ , ధర్మసాగర్ చెస్‌క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్ ఈపోటీలను సమన్వయం చేశారు. సెయింట్ పీటర్స్ విద్యా సంస్థల అధినేత నారాయణరెడ్డి, విశ్రాంత ఇంజనీర్ పొన్నాల రామయ్య, వరంగల్ నిట్ ఆచార్యులు ఆనంద కిశోర్, విశ్రాంత ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, విశ్రాంత ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి, చెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్రీహరిరామోజీ,హెచ్ఎం ధర్మ పాల్గొన్నారు.

బతుకమ్మ అంటేనే పూల పండుగ



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన మేయర్ సుధారాణి, అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



బతుకమ్మ ఆడుతున్న మంత్రి కొండా సురేఖ

- రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఖుష్‌మహల్ మైదానంలో అంబరాన్నంటిన సంబురాలు

ఖిలా వరంగల్: బతుకమ్మ అంటేనే పూల పండుగ అని, బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పాల్సిన అవసరం మనందరిపై ఉందని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని చారిత్రక మధ్యకోట ఖుషిమహాల్ మైదానంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచేలా రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మ కేవలం పూల పండుగ కాదని, ఇది ఆడబిడ్డల ఆశయాల పండుగ, ప్రకృతిని పూజించే పండుగ, భూదేవికి సమర్పించే నైవేద్యమని చెప్పారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. నగర ప్రజల కోసం 29,30 తేదీల్లో సద్దుల బతుకమ్మ ఆట స్థలాల్లో ఏర్పాట్లు చేశామని, 16 ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణ, ముస్కమల్ల అరుణ, పోశాల పద్మ, పల్లం పద్మ, డీఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కటాక్షపూర్ చెరువు మత్తడి



మత్తడి పోస్తున్న కటాక్షపూర్ చెరువు

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడి పెరిగింది. జాతీయ రహదారి–163పై ఉన్న మత్తడి ప్రవాహం పెరగడంతో వాహనదారులు ఇబ్బంది పడకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. లారీలు వెళ్లకుండా గూడెప్పాడ్ నుంచి మళ్లించారు. కార్లను శాయంపేట మీదుగా మళ్లించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

పెరుగుతూ.. తగ్గుతూ..



వాజేడు- గుమ్మడి దొడ్డి గ్రామాల మధ్య రహదారిపై వరద

- గోదావరి వరద ఉధృతి



ముంపునకు గురైన జాతీయ రహదారి

వాజేడు: గోదావరి దోబూచులాడుతోంది. శనివారం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు ఉధృతంగా పెరిగిన గోదావరి వరద 2 గంటల పాటు నెమ్మదించింది. సాయంత్రం 4 నుంచి మళ్లీ పెరుగుతూ రహదారులను ముంచెత్తింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి ఆదివారం సాయంత్రం 6 గంటలకు 15.890 మీటర్ల మేర పెరిగింది. టేకులగూడెం గ్రామ చివరిలోని జాతీయ రహదారి మళ్లీ ముంపునకు గురి కావడంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పల్లపు ప్రాంతాల నుంచి గోదావరి ప్రవహిస్తుండటంతో మిర్చి పంటలు ఇంకా నీటిలో మునిగి ఉన్నాయి.

సమ్మక్కసాగర్‌లోకి భారీగా వరద నీరు

కన్నాయిగూడెం: నాలుగు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఎగువన ఉన్న బ్యారేజీల నుంచి గోదావరిలోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది. దీంతో మండల పరిధిలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్కసాగర్ బ్యారేజీలోకి ఆదివారం భారీగా వరద నీరు వచ్చి చేరడంతో బ్యారేజీ వద్ద గోదావరి ఉగ్ర రూపంతో ప్రవహిస్తోంది. ఈ మేరకు బ్యారేజీలోకి ఆదివారం 7,78,600 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజీకి ఉన్న 59గేట్లను ఎత్తి అదే మోతాదులో నీటిని దిగువకు వదులుతున్నారు.

వేడివేడి.. టేస్టీ టేస్టీగా



వానాకాలం, చలి కాలాల్లో ఎక్కువగా మొక్కజొన్న కంకులకు గ్రేటర్ వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని మండల కేంద్రాలు, రహదారుల పక్కన విక్రయిస్తు ఉంటారు. రోడ్లకు ఇరువైపులా కాల్చిన, ఉడకబెట్టిన మొక్కజొన్న కంకులను ప్రయాణికులు కొనుగోలు చేసి తింటుంటారు. అడ్డా కూలీలు, కొందరు రైతులు మొక్కజొన్న పొత్తులను నగరానికి తీసుకొచ్చి విక్రయించి ఉపాధి పొందుతున్నారు.

- కాల్చిన, ఉడకబెట్టిన మొక్కజొన్న కంకులకు భలే డిమాండ్

కాజీపేట : ట్రై సిటీలోని అనేక ప్రాంతాల్లో ఉడకబెట్టిన, కాల్చిన కంకులు తినడానికి ప్రజలు మక్కువ చూపుతున్నారు. ప్రధాన రహదారులు, రైల్వే స్టేషన్లు, బస్టాండులలో తోపుడుబండ్లపై కాల్చిన, ఉడకబెట్టిన మొక్క జొన్న కంకులను విక్రయిస్తూ చిరు వ్యాపారులు, కొందరు రైతులు, మరికొందరు అడ్డా కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఈ సీజన్‌లో మక్క కంకుల విక్రయం జోరుగా సాగుతోంది.

కంకులకు భలే డిమాండ్.

నగరంలో దాదాపు 50కి పైగా ప్రాంతాల్లో చిన్న బొగ్గుల పొయ్యి ఏర్పాటు చేసుకొని కాల్చిన మొక్కజొన్న కంకులు విక్రయిస్తున్నారు. ప్రతీ ఏటా వేడి వేడి మొక్కజొన్న కంకులకు ఆదరణ పెరగడంతో కాల్చి విక్రయించే కేంద్రాలు పెరిగిపోతున్నాయి. దీంతో నగరంలోని అనేక ప్రాంతాల్లో మొక్కజొన్న కంకుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే, ఉడకబెట్టి కంకులను విక్రయిస్తున్నారు. రూ.15నుంచి రూ.20లకు ఒక కంకి చొప్పున అమ్ముతున్నారు.



కాజీపేట రైల్వే స్టేషన్ పరిధిలో కంకులు కాల్చుతున్న మహిళ

మొక్కజొన్న కంకులు ఇష్టం



వానాకాలం, చలికాలాల్లో కాల్చిన కంకులు తినడం అంటే ఎంతో ఇష్టం. రహదారిపై ఆగి మరి కొని తింటా. పచ్చి కంకుల ధరకన్నా కాల్చినా, ఉడక బెట్టిన కంకులకు నాలుగు పైసలు ఎక్కువే. అయినా అమ్మకందారుల శ్రమను గుర్తించాలి.

- కుమ్మరి రాజ్‌కుమార్, సోమిడి

బస్తీబస్తీ తిరుగుతూ...

రెండేళ్ల నుంచి తోపుడు బండ్లపై మొక్కజొన్న కంకుల విక్రయాలు పెరుగుతున్నాయి. సాధారణంగా పొట్టు తీసి కాల్చడం కంటే పొట్టుతో సహా కాలిస్తే గింజలు మరింత రుచిగా ఉంటాయని రైతులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది జూలై నుంచే మక్క కంకులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి.

కొన్ని ప్రాంతాల్లో రైతులే నేరుగా..

కొన్ని ప్రాంతాల్లో రైతులే నేరుగా మొక్కజొన్న కంకులను విక్రయిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టూ పక్కల ప్రాంతాల రైతులు పండించిన మొక్కజొన్న కంకులను వ్యవసాయ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వివిధ జిల్లాలకు చెందిన రైతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వరంగల్ నగరంలోని ప్రత్యేక అడ్డాల్లో కంకులను హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. ఇలా విక్రయించడం వల్ల కొంత లాభం వస్తున్నప్పటికీ ట్రాఫిక్ పోలీసుల నుంచి ఇబ్బందులు తప్పడంలేదని వారు ఆవేదన చెందుతున్నారు.